క్లుప్తంగా

నేడు మండల సమావేశం

రాజానగరం: స్థానిక మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జరగనుంది. కార్యాలయ మీటింగ్ హాలులో ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని ఎంపీడీఓ బి.రామారావు సూచించారు. ప్రజాప్రతినిధులు తప్పని సరిగా పాల్గొని స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పందలపాక చర్చిలో దుప్పట్లు అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ

బిక్కవోలు: పందలపాక చాకలి పేటలో ఉన్న చర్చి వద్ద 20 మంది పేదలకు మాజీ జెడ్పీటీసీ డాక్టర్ కిలపర్తి సత్యనారాయణ సమకూర్చిన దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎమ్.రత్నం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, జిలగం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం

సీతానగరం: చినకొండేపూడికి చెందిన 28 ఏళ్ల కేతమళ్ల రాజు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా సోమవారం రాత్రి కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్న రాజు అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడు. అయితే రాజును ఆమె అన్నయ్య నిలదీయడంతో మనస్తాపం చెంది ఈ నెల 15న ఇంటివద్ద ఉన్న గడ్డి మందు తాగాడు. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే



బలభద్రపురంలో సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో ఉన్న సత్తెమ్మ తల్లిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతరను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పశుగ్రాసంగా జనుము



చంద్రేడు పొలాల్లో వేసిన జనుము

రంగంపేట: మెట్టప్రాంతంలో పాడి పశువులకు పశుగ్రాసంగా రైతులు జనుమును పండిస్తున్నారు. వేసవిలో పశువులకు మేత కొరత తీవ్రంగా ఉంటుంది. ఈ సమస్యను అధిగమించడానికి రైతులు ఖరీఫ్ వరి కోతల అనంతరం పొలాల్లో, గట్లపై జనుము విత్తనాలు చల్లుతున్నారు. యంత్రాలు, మిషన్లు వచ్చిన తరువాత వరి కుప్పలు వేయకుండా మిషన్ల ద్వారా వరి కోతలు కోయడంతో ఎండుగడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో జనుమును వేస్తున్నారు. జనుమును పశువులకు పచ్చి దాణాగాను, ఎండబెట్టి వేసవి కాలంలోను పశుగ్రాసంగా ఉపయోగిస్తున్నారు. జనుమును పశువులు కూడా ఇష్టంగా తింటాయని రైతులు చెబుతున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



బిక్కవోలులో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

బిక్కవోలు: మండలంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం పుష్యమి మాసం, దశమి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం ఈవో రామలింగ భాస్కర్, ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకటసుబ్బారెడ్డి, శ్రీలక్ష్మీగణపతి ఆలయం కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చెరలో రాజానగరం

- రోడ్లపైనే పార్కింగ్
- తరచూ ట్రాఫిక్ జామ్‌లు



రాజానగరం గాంధీబొమ్మ సెంటర్‌లో నిలిచిన వాహనాలు

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం ట్రాఫిక్ సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాలు కూడా ఎక్కువైన నేపథ్యంలో రోడ్లు ఇరుకై పోయి, తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఇటు అన్నదాన సత్రం, అటు బస్టాండ్ వరకు నిత్యం ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోంది. పాత ఎన్‌హెచ్ రోడ్డు విస్తరణ తక్కువగా ఉండటంతో పాటు ఇరువైపులా ఉన్న దుకాణాలు కూడా రోడ్డును ఆక్రమించాయి. ఆయా దుకాణాలకు వచ్చే కొనుగోలుదారుల వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీనితో బస్సులు, కార్లు వంటి ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

నిబంధనలు బేఖాతరు

ఇక్కడ లక్ష్మణరేఖగా ఉన్న మేజర్ సీసీ డ్రైనేజీని దాటి రోడ్డు పైకి రాకూడదనే నిబంధనలున్నాగానీ వాటిని వర్తకులు, కొనుగోలుదారులు ఖాతరు చేయడం లేదు. అసలే ఇరుకుగా ఉన్న రోడ్డు, ఆపై ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అగ్నికి ఆజ్యం తోడైనట్టు ఆటోలను కూడా రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయడం కూడా సమస్య తీవ్రతకు మరో కారణంగా మారుతోంది. ఇటీవల గడ్డిలోడుతో ఉన్న ట్రాక్టర్ వెళ్లడంతో సమస్య తీవ్ర రూపం దాల్చింది. ఈ సందర్భంగా ఏర్పడిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు గంటన్నర సమయం పట్టింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మేజర్ సీసీ డ్రైనేజీని దాటి వ్యాపార లావాదేవీలు, వాహనాల పార్కింగ్ లేకుండా చేస్తే ట్రాఫిక్ సమస్య చాలావరకు పరిష్కారమవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు.

ఆక్రమణల చెరలో..

రాజానగరంలో ఆక్రమణలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ప్రభుత్వ స్థలాలను తరచూ కబ్జా చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. గ్రామంలోని ప్రధాన రోడ్డయిన పాత ఎన్‌హెచ్ పూర్తిగా ఆక్రమణల బారిన పడి ఇరుకైపోయింది.

– మోది సత్తిబాబు, రాజకీయ నాయకుడు

చర్యలు తీసుకోవాలి

వివిధ రకాల వ్యాపార లావాదేవీలకు గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్ ఒక్కటే ప్రధాన కేంద్రంగా ఉంది. ఇటు హైస్కూలు, అటు సాయిబాబా గుడి సెంటర్ వైపు వ్యాపారాలను విస్తరిస్తే ట్రాఫిక్ సమస్య చాలావరకు తగ్గుతుంది. ఆటోలను కూడా బస్టాండ్‌లో రోడ్డుపై పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ వి.కనకరాజు, లెక్చరర్

వారి కలయిక అపురూపం

ఐదు తరాల కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక



ఎమ్మెల్యే దంపతులను సత్కరిస్తున్న డాక్టర్ తాడి రామగురెడ్డి తదితరులు

అనపర్తి: అనపర్తి మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన తాడి వెంకటరెడ్డి వంశీకులు ఆత్మీయ కలయిక పేరుతో మంగళవారం కలుసుకున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఐదు తరాలకు చెందిన తాడి వారి కుటుంబ సభ్యులు పొలమూరు శ్రీదేవి ఫంక్షన్ హాలులో సమావేశమయ్యారు. వ్యాపారపరంగా ప్రాముఖ్యత గల వెంకటరెడ్డి కుటుంబానికి చెందిన వారు అమెరికాతో పాటు దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. ఈ ఆత్మీయ కలయిక సమావేశంలో సుమారు 280 మంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలతో బంధాలు, బంధుత్వాలు వృద్ధి చెందుతాయన్నారు. తాడి వంశీకులు మాట్లాడుతూ విశాఖపట్టణంలో నివాసముంటున్న తాడి శ్రీనివాసరెడ్డి, పొలమూరులో ఉంటున్న తాడి సతీష్‌రెడ్డిల చొరవతో కుటుంబ సభ్యులంతా ఒకే వేదికపై కలుసుకోవటం చాలా సంతోషాన్ని కలిగించిదన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులను తాడి వంశీకులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, తాడి సత్యనారాయణరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

సత్తి వారి ఆత్మీయ కలయిక

బిక్కవోలు: బంధువులతో సరదా గడిపేతే నిజమైన ఆనందమని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి, ఆంధ్రాషిర్డి సాయి ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు సబెళ్ల పురుషోత్తం రెడ్డి అన్నారు. మంగళవారం బలభద్రపురం గ్రామంలోని ఆంధ్రా షిర్డి సాయి ఆలయం వద్ద గ్రామానికి చెందిన సత్తి వారి ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామానికి వచ్చిన సుమారు 300 మంది సత్తి వారి కుటుంబ సభ్యులు కలుసుకున్నారు. రోజంతా ఆటపాటలతో పిల్లలు, పెద్దలు సందడి చేశారు.



ఆత్మీయ కలయికలో సత్తి వారి కుటుంబ సభ్యులు

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు తదితరులు

రంగంపేట: మండలంలోని ఎస్టీరాజాపురంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు మంగళవారం అందజేశారు. స్థానిక సర్పంచ్ అడ్డాల పద్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు పాల్గొని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్‌తో కలసి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. మొదటి బహుమతి గెలుచుకున్న గొల్లపల్లి ఝాన్సీకి ఫ్రిజ్, రెండో బహుమతి గెలుపొందిన సుహాసినికి వాషింగ్ మిషన్, మూడో బహుమతి మేడిశెట్టి మోహనలక్ష్మికి గ్రైండర్ అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డాల వెంకటేష్, పప్పు వెంకటేశ్వర్లు, బదిరెడ్డి ఈశ్వరరావు, గ్రామ కన్వీనర్ నల్లమోలు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి పండగ

గోకవరం: సంక్రాంతి పండగ ముగిసింది. భోగి పండుగతో మొదలైన ఈ పండగ మంగళవారం ముక్కనుమతో ముగిసింది. ముక్కనుమ రోజున ప్రజలు ఇళ్లలో గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించారు. నాలుగు రోజుల పండగను ఇంటిల్లపాది ఆనందంగా జరుపుకొని మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో గోకవరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రద్దీగా మారింది. మండలంలో జూదాలు జరుగకుండా పోలీసులు కట్టడి చేశారు. సాంప్రదాయ బద్ధంగా కోడిపందేలు, ఆటలు మినహా గుండాట, పేకాట వంటివి ఆడకుండా చర్యలు చేపట్టారు. పలు గ్రామాల్లో జూదాలు ఆడేందుకు ప్రయత్నించినప్పటికీ ఎస్సై యూవీ శివనాగబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారం అందుకుంటూ జూదాలను కట్టడి చేశారు.

పెద్దలను గౌరవించడం నేర్పించండి



వడిశలేరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల్ని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

రంగంపేట: తల్లిదండ్రులను, గురువులను గౌరవించడం బాల్యం నుంచి పిల్లలకు నేర్పించాలని విశ్రాంత తెలుగు పండితుడు పెరుమాళ్ళ రఘునాథ్ సూచించారు. మంగళవారం వడిశలేరు ఉన్నత పాఠశాలలో 2001–06 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మిత్రులంతా తమ చిన్ననాటి విశేషాలను గుర్తు చేసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. అనంతరం ఉపాధ్యాయుల్ని ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ఆదిలక్ష్మి, కిరణ్, వరప్రసాద్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మ తీర్థం

అనపర్తి: మండలంలోని కుతుకులూరులో గంగాలమ్మ తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి తీర్థం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ఎన్‌డీఆర్, వైఎస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఉప సర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సత్తి దొరయ్యరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి ఎంపీహెచ్ఈఓ రాయుడు

గోకవరం: గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికల్లో రక్తహీన తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి సీహెచ్ఓ మేరీకృప, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం అనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, విద్యాశాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. దీనిలో భాగంగా డిపార్ట్‌మెంట్లు వారీగా చేయాల్సిన కార్యక్రమాల గూర్చి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

గురుస్వామి ఆదిరెడ్డికి ఘన సత్కారం



ఆదిరెడ్డి గురుస్వామి దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

రాయవరం: సోమేశ్వరం గ్రామానికి చెందిన కర్రి ఆదినారాయణరెడ్డి(ఆదిరెడ్డి గురుస్వామి)ని మంగళవారం ఘనంగా సత్కరించారు. ఆయన నవంబరు 26న శబరిమలకు కాలినడకన బయలుదేరి 50 రోజులు పాటు 1,370 కిలోమీటర్లు పయనించి శబరిమల యాత్ర పూర్తి చేసిన విషయం తెలిసిందే. గ్రామానికి చేరుకున్న ఆదిరెడ్డి గురుస్వామిని ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయ నిర్మాత కనకరాజు, వైఎస్సార్ సీపీ నేత దూళిపూడి వెంకటేశ్వరరావు, గరగ శ్రీనివాసరావు, గరగ సోమన్న, కర్రి భామిరెడ్డి, సూర్యచంద్రారెడ్డి, జరజాపు లక్ష్మణస్వామి తదితరులు ఘనంగా సత్కరించారు.

పీహెచ్‌సీలో సమావేశం

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.రాధాకృష్ణ మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంఈవో కె.స్వామి నాయక్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. పదేళ్ల నుంచి పందొమ్మిదేళ్ల ఆడపిల్లలు, గర్భిణులు, బాలింతలకు రక్తహీనత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయించాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య సంఖ్య ప్రతి ఒక్కరికి ఇవ్వడం కోసం వలంటీర్లు, ఏఎన్ఎంలు కలసి సర్వే చేయాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు కె.సుధాకర్, దైవకృప, సూర్యకుమారి పాల్గొన్నారు.

గడియారానికి అందమైన ఆకృతి



చెక్కఫ్రేమ్‌లతో అందంగా రూపొందించిన గడియారాలు

రాజానగరం: వేకువజామునే నిద్ర లేవాలంటే అలారం పెట్టుకుంటాం. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే గోడనున్న గడియారాన్ని, ప్రయాణంలో చేతికున్న వాచీని చూసుకుంటూనే ఉంటాం. ఇలా మనిషి జీవితంలో ఒక భాగమైపోయిన గడియాన్ని ముఖ్యంగా గోడ గడియాన్ని అందమైన ఆకృతిలో అమరిస్తే ఎవరికి ఇష్టం ఉండదు. ఆ ఇష్టాన్నే తన వృత్తిగా చేసుకున్నాడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఫర్మాన్ (36) అనే యువకుడు. సహజంగా ప్రతి ఇంటిలోనూ గోడ గడియారాలు ఉంటాయి. అయితే ఆ గడియారాలను కత్తుల ఒర, గిటార్, ఈగల్, జింక, యాపిల్, చేతి వాచీ.. మున్నగు అనేక రూపాలలో చెక్కఫ్రేమ్‌లలో అమరిస్తే బాగుంటుంది కదూ. ఆ విధంగా ఆకట్టుకునే రూపాలతో రూపొందించిన గోడ గడియారాలను లాలాచెరువు వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై విక్రయిస్తున్నాడు. ఆకృతిని బట్టి రూ.600 నుంచి రూ.వెయ్యి వరకూ అమ్ముతున్నాడు.



యాపిల్ ఆకారంలో..



గిటార్ రూపంలో..

క్రికెట్ టోర్నమెంట్ విజేత వాడపల్లి జట్టు



అంగరలో టోర్నమెంట్ విజేత జట్టుకు జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: అంగరలో సిద్ధిరెడ్డి నరసబాబు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గత 12 రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా వాడపల్లి జట్టు నిలిచింది. మంగళవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో ప్రత్యర్థి జట్టు కె.గంగవరంపై 8 వికెట్ల తేడాతో వాడపల్లి జట్టు కప్ గెలుచుకుంది. విజేత జట్టుకు రూ.25 వేలు నగదు బహుమతి, జ్ఞాపికలను అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, నిర్వాహకులు చేతుల మీదుగా అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కె.గంగవరం జట్టుకు రూ.15వేలు నగదు బహుమతి, జ్ఞాపికలను పడమర ఖండ్రిక సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి అందజేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో అనేక సామాజిక కార్యక్రమాలను చేస్తూ గుర్తింపు తెచ్చుకున్న సిద్ధిరెడ్డి నరసబాబు జ్ఞాపకార్థం నిర్వహించిన టోర్నమెంట్ విజయవంతంగా ముగిసిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, వంగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ అసోసియేషన్ సమావేశం

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల రెవరెండ్ రమేష్ చర్చిలో మంగళవారం యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు రెవరెండ్ చిర్రా ప్రసాద్ మాట్లాడుతూ పాస్టర్లు క్రీస్తు బోధనలను విస్తృతం చేయాలన్నారు. కార్యదర్శి పీజే రాజు, కె.అబ్రహాం, డి.రాజు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొని వ్యక్తి మృతి

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో కొల్లి బుజ్జిదొర (33) చెట్టును ఢీకొని ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. రంగంపేట మండలం వడిశలేరు గ్రామానికి చెందిన బుజ్జిదొర సంక్రాంతి పండగ సందర్భంగా బావమరిది ఇంటికి శ్రీరంగపట్నం వచ్చాడు. ఈ నేపథ్యంలో మోటారుసైకిల్‌పై వెళుతూ చెరువు గట్టు పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సీతానగరంలో సమ్మేళనానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఈ పాఠశాలలో 1987 – 88లో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులందరూ తరలివచ్చి సందడి చేశారు. ఆనాటి జ్ఞాపకాలు గుర్తుతెచ్చుకుని సంతోషంగా గడిపారు. చెరుకూరి ఉదయ్ భాస్కర్, బండి జగదీష్, కొడమంచిలి ఉమాకుమార్, ముత్యాల సూర్యనారాయణ, నీరుకొండ ప్రమీల, కొల్లేపర పుష్పలత, రంధి భారతీదేవి, నీరుకొండ జానకి దేవి, వెంకటపతి, బండారు ప్రసాద్ తదితరులు అప్పటి తీపి గుర్తులను తెలియపర్చుతూ సందడి చేశారు. ఉపాధ్యాయురాలు సుగుణతోపాటు డ్రాయింగ్ మాస్టార్ రామ్‌ప్రసాద్ దంపతులను సన్మానించారు. అప్పటి హైస్కూల్ సిబ్బంది భూలోకం, చిన్నాను సత్కరించారు.

దోసకాయలపల్లిలో..



దోసకాయలపల్లి హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లి హైస్కూల్లో 1998 – 99 సంవత్సరం పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ముగ్గురు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ పాఠశాలలో చదువుకుని, వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న 72 మంది సమ్మేళనంలో పాల్గొన్నారు. విశ్రాంత హెచ్ఎం, గణిత శాస్త్రంలో లిమ్కాబుక్ అవార్డు గ్రహీత యనమదల భానురాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వరరావు సందేశాన్ని ఇచ్చారు.



జి.మామిడాడ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పెదపూడి: జి.మామిడాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1980–81 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక మంగళవారం జరిగింది. పూర్వ విద్యార్థులు వారి కుటుంబాల సమేతంగా కార్యక్రమానికి హాజరయ్యారు. మిత్రులంతా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఒకింత ఉద్వేగానికి గురయ్యారు. ఎవరెవరు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో, ఎక్కడుంటున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయుల్ని గుర్తుకు తెచ్చుకున్నారు. పూర్వ విద్యార్థుల పిల్లలు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించాయి. తామంతా ఎక్కడున్నా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు.